లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

సంగారెడ్డి కలెక్టరేట్/ కొండాపూర్, ఏప్రిల్ 19: మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు శనివారం వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ స్వయంగా తెలంగాణ అంతటా తిరిగి గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజల పరిస్థితులకు చలించి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేద ఆడబిడ్డల పెండ్లిండ్లు చేసి వారి కుటుంబాలకు అండగా నిలిచారన్నారు. కొండాపూర్ మండలానికి 40 కల్యాణలక్ష్మి, 14 షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు మల్లా గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకం విఠల్, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు రుక్మోద్దీన్, మాజీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు రాంచద్రయ్య, అంజిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నాగయ్య, ఇంద్రారెడ్డి, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

27న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

జిన్నారం, ఏప్రిల్ 19: తెలంగాణ ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష 2025 ఏప్రిల్ 27న నిర్వహిస్తామని బొల్లారం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి శనివారం ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7 నుంచి 10 తరగతి వరకు ప్రవేశాలకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు https://telanganams.cgg.gov.in వెబ్సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆమె సూచించారు.

పుల్కల్‌లో ఖాళీబిందెలతో రోడ్డెక్కిన మహిళలు, గ్రామస్తులు

మంత్రి ఇలాకాలో తాగునీటి ఎద్దడి

పుల్కల్‌లో ఖాళీబిందెలతో రోడ్డెక్కి గ్రామస్తుల నిరసన

పుల్కల్, ఏప్రిల్ 19: మండలకేంద్రం తనది అని చెప్పుకొనే వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇలాకా పుల్కల్ గ్రామంలో తాగునీటి ఎద్దడి చోటు చేసుకుంది. గ్రామంలోని ఫస్ట్ వార్డులో ఇరవై రోజులుగా తాగునీరు రావడం లేదని మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకున్న పాపానపోలేదని గ్రామస్తులు ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శికి తాగునీరు రావడం లేదని చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. తాగునీటి కోసం ఖాళీ బిందెలతో రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఎదురైందని గ్రామస్తులు వాపోయారు. డౌన్ డౌన్ అంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోడ్డుపై ఖాళీబిందెలు పెట్టి నినాదాలు చేశారు. తక్షణమే తాగునీటిని విడుదల చేయాలి, లేదంటే ఖాళీబిందెలతో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామంటు గ్రామస్తులు హెచ్చరించారు.

కాజిపల్లి పారిశ్రామికవాడలో సమ్మె కరపత్రాన్ని విడుదలచేస్తున్న రాజయ్య

సమ్మె కరపత్రం విడుదల

జిన్నారం, ఏప్రిల్ 19: లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా మే 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్మిక సభ్యుడు రాజయ్య పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని కాజిపల్లి పారిశ్రామిక వాడలోని టీఐడీసీ పరిశ్రమ ఎదుట ఈమేరకు కార్మికులతో కలిసి సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...మోదీ ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. కార్మికులు, ఉద్యోగులు పెద్దఎత్తున సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్ రెడ్డి, సత్తయ్య, చంద్రశేఖర్, సుధాకర్ గౌడ్, రాజు, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి...తొమ్మిది మంది అరెస్టు

సిర్గాపూర్, ఏప్రిల్ 19: పేకాట స్థావరంపై దాడి చేసి 9 మందిని అరెస్టు చేసినట్లు సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి శనివారం తెలిపారు. మండలం పరిధిలోని గోసాయిపల్లిలో చాకలి శ్రీనివాస్ ఇంటి ఎదుట పేకాట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం రావడంతో పోలీసులు రైడ్ చేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.10,100 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు. వీరిని నారాయణఖేడ్ కోర్టులో హాజరుపరుస్తున్నామని చెప్పారు. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడితే సమాచారమివ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ తెలిపారు.

పాఠశాలల ఇన్‌చార్జిలకు డ్రెస్స్ మెటీరియల్ అందజేత

గుమ్మడిదల, ఏప్రిల్ 19: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వచ్చే విద్యాసంవత్సరానికి డ్రెస్సులు అందజేయడానికి కృషి చేస్తున్నట్లు ఎంఈవో తెలిపారు. శనివారం మండలంలోని 23 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సరిపడా దుస్తులు పంపిణీ చేయడానికి పాఠశాలల ఇన్‌చార్జిలకు డ్రెస్ మెటీరియల్‌ను ఎంఈవో రాంబాబు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులు ముగిసిన వెంటనే పాఠశాల పునఃప్రారంభ సమయంలో విద్యార్థులకు డ్రెస్సులు అందజేయడానికి ముందస్తుగానే ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. డ్రెస్ మెటీరియల్‌తో విద్యార్థులకు సరిపడా దుస్తులు సిద్ధం చేయాలని సూచించారు. వీరితోపాటు ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

కల్హేర్, ఏప్రిల్ 19:జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు యెన్నం అనిల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బీబీపేట్‌లో రైతులు ఎండబెట్టిన జొన్నలను ఆయన పరిశీలించి మాట్లాడారు. 2016లో బీబీపేట్‌లో రాష్ట్రంలోనే మొదటిసారిగా కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. మండలంలోని రైతులు అధికశాతం జొన్నలు పండించారన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకుండా రైతులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. తక్కువగా పండించిన చోట కేంద్రాన్ని ఏర్పాటు చేసి జొన్నలు అధికంగా సాగు చేసిన చోట కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ నాయకులకు రైతుపై ప్రేమ ఉంటే బీబీపేట్‌లో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళనలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో కంట్రపల్లి చంద్రశేఖర్, పిట్ల నవీన్, రాజు, సంతోష్, రాజారాం గౌడ్, రాజు ఉన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

సదాశివపేట, ఏప్రిల్ 19: ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించనున్న రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం సదాశివపేటలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కేసీఆర్ బహిరంగ సభ జన సమీకరణపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ కేసీఆర్ బహిరంగ సభ సమయాన్ని ప్రజలకు వివరించి గ్రామాల్లో రజతోత్సవ సభ పోస్టర్లను అతికించాలని సూచించారు. బహిరంగ సభలో ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమ కార్యాచరణ, దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్ద గొల్ల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి ఆరిఫోద్దిన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడీల సుధీర్‌రెడ్డి, మల్లాగౌడ్, మాజీ ఎం పీపీ కిష్టయ్య, లక్ష్మారెడ్డి, నాయకులు నరేష్‌గౌడ్, సుధాకర్, అల్లం లలిత, నిజాముద్దీన్, పెద్దగొల్ల శ్రీహరి, మాధవరెడ్డి, సంతోష్‌గౌడ్, రాములు, మన్నెభాస్కర్, రవి, శ్రీనివాస్, నల్లోల కుమార్, హన్మంత్‌రెడ్డి, శేఖర్, మాణిక్, కరుణాకర్, సంగమేశ్వర్, రాములు, నగేశ్, అంజన్న, శివకుమార్, జానీమి యా, చోటు మియా, లక్ష్మణ్, మల్లేశం, బసవరాజ్, శ్రీశైలం, మన్సూర్, బాబుమియా, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

పటాన్‌చెరు, ఏప్రిల్ 19: రాష్ట్రంలో ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, కేసీఆర్‌ను మరోసారి సీఎంను చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదర్శ్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ మహాసభకు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుచేయడంలో విఫలమైందన్నారు. సాధ్యం కానీ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ప్రతి గ్రామం నుంచి స్వచ్ఛందంగా వరంగల్ సభకు వచ్చేందుకు నాయకులు కార్యకర్తలు సిద్ధమవుతున్నారన్నారు. సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యం చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని ఎన్నికల్లో కల్యాణ లక్ష్మితోపాటు తులం బంగారం ఇస్తామని ప్రకటించి మోసం చేశారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొలను బాల్ రెడ్డి, వెంకటేశంగౌడ్ తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆదర్శ్‌రెడ్డి. బీఆర్ఎస్ నాయకులు

రసవత్తరంగా కుస్తీ పోటీలు

కుస్తీలో తలపడుతున్న మల్లయోధులు

కంగ్టి, ఏప్రిల్ 19: కంగ్టి సిద్ధేశ్వరాలయ జాతరలో భాగంగా శనివారం నిర్వహించిన కుస్తీపోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీల్లో పాల్గొనేందుకు కర్నాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి మల్లయోధులు తరిలివచ్చారు. రూ.50 నుంచి రూ.5వేల వరకు కుస్తీ పోటీలు కొనసాగాయి. పిల్లల నుంచి యువకులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కుస్తీపోటీల్లో గెలుపొందిన వారికి ఆలయ పాలకమండలి నగదు పురస్కారాన్ని అందజేశారు. సుమారు 100మంది వరకు మల్లయోధులు పోటీల్లో పాల్గొన్నారు. ఆఖరి కుస్తీ రూ.5వేలు ఉండగా మహిళా పురుషుడి మధ్య హోరాహోరీగా కుస్తీపోటీ కొనసాగింది. ఇందులో మహారాష్ట్రకు చెందిన వ్యక్తి గెలుపొందగా, ఆయనకు రూ.5వేల నగదును ఆలయ పాలకమండలి బాధ్యులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంకటేశం గుప్తా, ఈవో శివరుద్రప్ప తదితరులు పాల్గొన్నారు. సోమవారం రథశిఖరం దించడంతో ఉత్సవాలు ముగుస్తాయని పాలకమండలి తెలిపింది.

శాంతియుత సమాజం కోసం పాటుపడాలి

రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి, కార్పొరేటర్ పుష్పానగేశ్

రామచంద్రాపురం, ఏప్రిల్ 19:శాంతియుత సమాజం కోసం ప్రతిఒక్కరూ పాటుపడాల్సిన అవసరం ఉన్నదని బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి అన్నారు. గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పండుగలను పురస్కరించుకొని శనివారం ఆర్సీపురం డివిజన్‌లోని సండే మార్కెట్ నుంచి ప్రారంభమైన రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు ఆదర్శ్‌రెడ్డి, కార్పొరేటర్ పుష్పానగేశ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశం అంటేనే భిన్నత్వంలో ఏకత్వమని, ప్రజలందరూ కలిసిమెలిసి సోదరభావంతో ఉండాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో మాజీ సీఎం కేసీఆర్ ప్రజలందరూ ఐకమత్యంతో ఉండాలనే ఉద్దేశంలో పండుగలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. క్రిస్మస్, రంజాన్, బతుకమ్మ ఇలా అన్ని పండుగలను అధికారికంగా నిర్వహించి ప్రజలందరినీ కలిసిమెలిసి ఉండేలా చేశారన్నారు. ప్రజల్లో సోదరభావం పెంపొంది ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో అం జయ్య, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి

వైద్యారోగ్య శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ

అందోల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి దామోదర

అందోల్, ఏప్రిల్ 19: అందోల్–జోగిపేట మున్సిపల్ పరిధిలో నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాల, 50 బెడ్ల మాతా, శిశు ఆరోగ్య సంరక్షణకేంద్రంతోపాటు ప్రభుత్వ దవాఖానలో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం నర్సింగ్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలతోపాటు కస్తూర్బాబాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ సత్వరమే పూర్తి చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ల్యాబ్‌లో ఏసీలు కావాలని, కాలేజీకి వెళ్లేందుకు బస్సు కావాలని విద్యార్థులు కోరగా ఏర్పాటు చేస్తానని హామీనిచ్చారు. కళాశాలల చుట్టూ పరిసరాలు బాగాలేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి మళ్లీ వారంలో వస్తానని అప్పటివరకు పరిస్థితిలో మార్పురావాలని సూచించారు.

ఈజీఎస్ బిల్లులు ఇవ్వాలని నిలదీత

కోహీర్, ఏప్రిల్19: రెండు నెలలపాటు ఉపాధి పనులు చేసినా బిల్లులు చెల్లించలేదని కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పీచెర్యాగడి జడ్పీ ఉన్నత పాఠశాలలో వాటర్‌షెడ్ యాత్ర కార్యక్రమంలో పాల్గొన్న ఈజీఎస్ అధికారులను వారు నిలదీశారు. పైసలు లేకుండా తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లులు వచ్చిన వెంటనే చెల్లిస్తామని చెప్పడంతో వారు శాంతించారు.

అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు

కంగ్టి, ఏప్రిల్ 19: అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు మంజూరవుతాయని కంగ్టి తహసీల్దార్ భాస్కర్ అన్నారు. శనివారం ఎంపీడీవో సత్తయ్యతో కలిసి మండలంలోని తడ్కల్, దామరిగిద్ద, ముర్కుంజాల్, బాన్సువాడ, చౌకన్‌పల్లి, గాజుల్‌పాడ్, రాజారాం తండా, ఘన్‌పూర్, చందర్ తండా, నాగూర్(కె) గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం కమిటీతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం రూ.5 లక్షలు సహాయం చేస్తుందని తెలిపారు. మంజూరైన వారు తప్పనిసరిగా ఇంటిని నిర్మించుకోవాలని, వారికి కొన్ని విడతల్లో డబ్బు లు బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సుభాష్, కార్యదర్శులు పాల్గొన్నారు.

దామరిగిద్దలో మాట్లాడుతున్న తహసీల్దార్ భాస్కర్

సంగారెడ్డిలో రన్ ఫర్ జీసస్ ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

ఘనంగా రన్ ఫర్ జీసస్ ర్యాలీ

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 19: యూనైటెడ్ క్రిస్టియన్ యూత్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం సంగారెడ్డిలో రన్ ఫర్ జీసస్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ర్యాలీలో క్రైస్తవులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రూబెన్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు మధు, వినయ్ రాజ్, ప్రధాన కార్యదర్శులు సునీల్ జయకుమార్, సోలమన్, సునీల్ నిర్మల్, అబ్రహం, సభ్యులు శెషికాంత్, రాజు, ప్రభాకర్, శివకుమార్, రవి, ప్రకాశ్‌రెడ్డి, వివిధ చర్చిల పాస్టర్లు, మతపెద్దలు పాల్గొన్నారు.

ద్వాక్రా సంఘాల మహిళలకు చెక్కు అందజేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

పేదలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకే వాటర్‌షెడ్

కోహీర్, ఏప్రిల్19: భూమిలేని నిరుపేదలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకే వాటర్‌షెడ్ పథకాన్ని అమలు చేస్తున్నామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని పీచెర్యాగడిలో ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన ద్వారా మంజూరు చేసిన రూ.10.26కోట్లతో చేపట్టిన వాటర్‌షెడ్ యాత్రను ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్‌తో కలిసి మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఆర్థికంగా నిలదొక్కుకోవడం అంతసులువైన పని కాదన్నారు. నీటి వనరులు లేని పీచెర్యాగడి ప్రాంతాన్ని వాటర్‌షెడ్ పథకం కింద ఎంపిక చేసి ఎనిమిది గ్రామాల్లో అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నామన్నారు. బాలికల చదువులకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ద్వాక్రా సంఘాల మహిళలకు రూ.1.56 కోట్ల చెక్కును అందజేశారు. పాఠశాలకు కంపౌండ్ వాల్, పేయింటింగ్, సీసీ కెమెరాలు కావాలని విద్యార్థులు మంత్రి దృష్టికి తెచ్చారు. అడిగిన వాటిని మంజూరు చేయిస్తానని మంత్రి హామీనిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్, ఆర్డీవో రాంరెడ్డి, తహసీల్దార్ బాలశంకర్, ఎంపీడీవో భారతి, ఏపీవో సునందరావు, ఏవో నవీన్‌కుమార్, ఏపీఎం సమ్మయ్య, రామలింగారెడ్డి, వీరారెడ్డి, తదితర నాయకులు ఉన్నారు.

బడంపేటలో ర్యాలీ

మండలంలోని బడంపేట పాఠశాల ఆధ్వర్యంలో శనివారం వాటర్‌షెడ్ పథకం ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. భూగర్భజలాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో జాకీర్ హుస్సేన్, హెచ్ఎం శ్రీనివాస్, సిరిపాల్, రాచన్న, దయానంద్ తదితరులున్నారు.

డంపింగ్ యార్డు మాకొద్దు: జేఏసీ నాయకులు

గుమ్మడిదల: నల్లవల్లిలో డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా 74వ రోజు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న రైతు జేఏసీ నాయకులు

గుమ్మడిదల, ఏప్రిల్19: డంపింగ్‌యార్డుతో వచ్చే కంపు మాకొద్దని సమీప గ్రామాల ప్రజలు సర్కారును కోరుకున్నారు. శనివారం గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల్లో డంపింగ్‌యార్డు (ఎంఎస్‌డబ్ల్యూ)కు వ్యతిరేకంగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 74వ రోజుకు చేరుకున్నాయి. ఈ రెండు గ్రామాల్లో రైతు జేఏసీ, మహిళా సంఘాల సభ్యులు రిలే నిరాహార దీక్షలను కొనసాగించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా దీక్షలు చేస్తున్న ఆందోళనకారులు, రైతు, మహిళా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్యారానగర్ డంపింగ్‌యార్డు వల్ల ఇక్కడి గ్రామాల ప్రజలకు తీవ్ర ముప్పు ఉందని ప్రభుత్వానికి, జిల్లా యంత్రాంగానికి సూచిస్తున్నా స్పందించకపోవడం సరికాదన్నారు. జిల్లా యంత్రాంగం డంపింగ్ యార్డుపై అభ్యంతరాలు తెలియజేయాలనడంతో వందకు వందశాతం డంపింగ్ యార్డు వద్దని అర్జీలు పెట్టుకున్నప్పటికీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తుందన్నారు. ప్రజాభిప్రాయాన్ని గౌరవించి వెంటనే డంపింగ్ యార్డుకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మన్నె రామకృష్ణ, కుమ్మరి ఆంజనేయులు, కొరివి సురేశ్, చాలప మధు, కొత్తపల్లి మల్లేశ్ గౌడ్, శంకర్, మహిళలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే భూభారతి

భూ భారతి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

పుల్కల్, ఏప్రిల్ 19: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నూతన భూభారతి 2025 చట్టం తీసుకువచ్చిందని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శనివారం పుల్కల్ రైతు వేదికలో నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం రెవెన్యూ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ.. ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వం నూతన భూభారతి చట్టానికి శ్రీకారం చుట్టిందన్నారు. రైతుల కోసం భూభారతి పోర్టల్‌లో నూతన పౌతి లాంటివి 30 రోజుల్లో పరిష్కారం అవుతాయన్నారు. అందుబాటులోకి వచ్చిందన్నారు. రైతులకు ఎలాంటి సమస్యలెదురైనా భూభారతి పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. వెంటనే ఆ సమస్యను తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీవో పాండు, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీవో ఆనంద్ మేరి, రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు. అనంతరం రైతు వేదిక సమీపంలో ఉన్న కేజీబీవీ పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థుల క్లాస్ రూంలోకి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మీకేమైన ఇబ్బందులు ఉన్నాయా అంటూ విద్యార్థులను కలెక్టర్ ప్రశ్నించగా, లేదు మేడం..మా పాఠశాలలో ఎలాంటి ఇబ్బందులు లేవు అంటూ సమాధానమిచ్చారు. పాఠశాల వాతావరణం చూసి కలెక్టర్ వల్లూరు క్రాంతి సంతోషం వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట ఎస్‌వో ఇందిరా, ఉపాధ్యాయులు ఉన్నారు.

అండర్‌పాస్ మూసివేయడంతో రాకపోకలు బంద్

ఇబ్బందులు పడుతున్న నాగులపల్లి, వెలిమెల గ్రామస్తులు

నాగులపల్లిలో రేడియల్ సర్వీస్ రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

రామచంద్రాపురం, ఏప్రిల్ 19: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులనాగులపల్లి గ్రామంలో ఉన్న రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిని రైల్వే అధికారులు మూసివేయండంతో రెండు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రేడియల్ రోడ్డులో భాగంగా అధికారులు సర్వీస్ రోడ్డును అభివృద్ధి చేయకపోవడంతో వాహనదారులు వెలిమెల గ్రామానికి వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. అండర్‌పాస్ బ్రిడ్జి ఉండడంతో నాగులపల్లి నుంచి వెలిమెలకు సాఫీగా బ్రిడ్జి కింది నుంచి వాహనదారులు వెళ్లేవారు. అండర్‌పాస్ బ్రిడ్జి కింది నుంచి రవాణా మార్గం సరిగ్గాలేదనే ఉద్దేశంతో రైల్వే అధికారులు దానిని మూసివేశారు. నాగులపల్లి గ్రామానికి చెందిన వారు వెలిమెలకు వెళ్లాలంటే రైల్వే రోడ్డులో లేదా కొల్లూర్ ఓఆర్ఆర్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. రైల్వే రోడ్డు పూర్తిగా గుంతలమయంకావడంతోపాటు వర్షాలకు ఆ మార్గం నుంచి ప్రయాణించ